గవర్నర్‌ను కలిసిన ఎంఎల్‌ఆర్‌ఐటీ విద్యా సంస్థల చైర్మన్



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: ఎంఎల్‌ఆర్‌ఐటీ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను గురువారం రాజ్‌భవన్‌లో కలిసి సత్కరించారు. ఇటీవల లక్ష్మణ్‌రెడ్డి కృష్ణానదిలో జరిగిన ఈత పోటీల్లో పాల్గొని మెడల్ సాధించడంతో లక్ష్మణ్‌రెడ్డిని గవర్నర్ అభినందించారు. 80 ఏళ్ల వయస్సులోనూ క్రీడల్లో రాణిస్తున్న ఆయన కృషిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ మార్టిన్స్ డైరెక్టర్లు చంద్రశేఖర్ యాదవ్, సంతోష్, ఎక్సెల్ గ్లోబల్ సర్వీసెస్ డైరెక్టర్ రామ్ కట్టెల పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఉమామహేశ్వర ఆలయం

సుభాష్‌నగర్: ఈ నెల 26న శివరాత్రి పండగను పురస్కరించుకొని సూరారంలోని ఉమామహేశ్వర ఆలయం ముస్తాబైంది. శివరాత్రి పండుగ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 24న ఉమామహేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, 25న రుద్ర యాగం, 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉదయం అభిషేకం, పాలాభిషేకం, లింగోద్భవ మహా పూజ, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న అన్నదాన కార్యక్రమం, 28న పవళింపు సేవ ఉంటుందని తెలిపారు. ప్రతి ఏటా పెరుగుతున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ బ్లూమ్



పెద్దలకు సన్మానం చేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: దూలపల్లిలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, నానమ్మ, అమ్మమ్మలు, తాతయ్యలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో వారిని పూలమాలతో సత్కరించి పాదాభివందనం చేయించారు. కుటుంబ విలువలను నేటి తరానికి తెలియజేయాలనే సదుద్దేశంతో ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో కొంపల్లి జోన్ ఏజీఎం రమణారావు, జోనల్ కో ఆర్డినేటర్లు రవి, ప్రిన్సిపాళ్లు భావన, హేమలత, డీన్ శ్రీహరి, ఇన్‌చార్జి కృష్ణం రాజు, ఐపీఎల్ ఇన్‌చార్జి త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా రవీందర్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా రవీందర్ నియమితులయ్యారు. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి టీజీఓఎస్ 2025 డైరీ అందజేశారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్స్ ఆర్డర్ తీసుకున్న రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కళ్లద్దాలు అందజేత

రంగారెడ్డినగర్: సామాజిక కార్యక్రమాల ద్వారా పేదలకు తోచిన సాయం సహాయం చేసేందుకు తమ సంస్థ పని చేస్తోందని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా లక్ష్మీనాథ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల సౌజన్యంతో ఇటీవల గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న 60 మందికి గురువారం స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటరాజం, స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు శ్రీనివాస్, తిమ్మయ్య, నవీన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న ప్రతినిధులు

ఎండాకాలం.. మండేకాలం

- నిబంధనలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు దూరం
- జీడిమెట్లలో అనుమతులు లేని రసాయన గోదాములు
- ప్రమాదాల నివారణకు చర్యలు అంతంతే!



ఎస్‌ఎస్‌వీ ప్యాబ్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం (ఫైల్)

జీడిమెట్ల: దూలపల్లి పారిశ్రామికవాడ, ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో రసాయన గోదాములతో పాటు ప్లాస్టిక్ గోదాములు విపరీతంగా ఉన్నాయి. ఏ ఒక్క గోదాములో అగ్నిప్రమాదాలను నివారించే చర్యలు యాజమాన్యాలు చేపట్టడం లేదు. గాల్లో దీపం పెట్టినట్లుగా పరిశ్రమలను నడుపుతున్నారు. దీంతో అగ్నిప్రమాదం సంబవించిన ప్రతిసారి లక్షల్లో ఆస్తినష్టంతో పాటు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి పరిశ్రమలో అగ్నిమాపక చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ అగ్నిమాపక నివారణ చర్యలు లేని పరిశ్రమలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఎండలు నెమ్మదిగా ముదురుతున్నాయి. వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్నపాటి అశ్రద్ధ పెద్ద ప్రమాదానికి దారి తీస్తోంది. ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించడానికి ఆస్కారం ఉంటుంది. జీడిమెట్ల ప్రాంతంలో పరిశ్రమలు అధికం. ఏ పరిశ్రమలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్థితి. అనుమతులు లేని రసాయన గోదాముల్లోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో రసాయన చర్య జరిగి అగ్నిప్రమాదాల జరిగే ఆస్కారం ఉంటుంది. కావున పరిశ్రమల్లో రసాయనాలను ప్రత్యేక పద్ధతుల ద్వారా చల్లటి ప్రదేశంలో భద్రపర్చాలని అధికారులు చెబుతున్నారు. ప్లాస్టిక్ పరిశ్రమలో కరెంట్ మీటర్లకు, స్విచ్ బోర్డులకు దగ్గరగా మండే స్వభావం ఉన్న రసాయనాలను ఉంచకూడదని సూచిస్తున్నారు. ప్రతి పరిశ్రమలో నీటిని చిమ్మే మోటార్‌లతో పాటు కార్బన్ డైఆక్సైడ్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలి. ఒకవేళ పరిశ్రమల్లో అగ్నిప్రమాదం సంబవిస్తే వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాలు

2024 నవంబర్ 26వ తేదీన జీడిమెట్ల దూలపల్లి రోడ్డులోని ఎస్‌ఎస్‌వీ ప్యాబ్స్ పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. నాలుగు రోజుల పాటు మంటలు మండటంతో మంటల ప్రభావానికి పరిశ్రమ మొత్తం నేలమట్టమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఆస్తినష్టం మాత్రం కోట్లలో జరిగింది. 2025 జనవరి 3వ తేదీన దూలపల్లిలోని తులసి కెమికల్స్ రసాయన గోదాము అంటుకుని తీవ్రంగా మంటలు వెలువడ్డాయి. రసాయనాల దాటికి పక్కన ఉన్న మూడు పరిశ్రమలకు మంటలు వ్యాపించాయి. ఈ అగ్ని ప్రమాదంలో గోదాము నామరూపం లేకుండా పోయింది.

స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం



పారిశ్రామిక ప్రాంతంతో పాటు రెసిడెన్షియల్ జోన్‌లలో స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నాం. చాలా వరకు అనుమతులు లేని గోదాములు జీడిమెట్లలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. వారి సూచన మేరకు చర్యలు చేపడతాం.అగ్ని ప్రమాదాలు జరుగకుండా యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలి.

– శేఖర్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, జీడిమెట్ల

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

- ఎమ్మెల్యే వివేకానంద్
- మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందజేత

కుత్బుల్లాపూర్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని బీఆర్‌ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం బహదూర్‌పల్లిలోని కెఎం పాండు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఆవరణలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 337 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ. 26.72 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని, ఆడపిల్ల విద్యాభివృద్ధితోనే కుటుంబం ఆర్థిక పరిపుష్టిని సాధిస్తుందన్నారు. మహిళల సాధికారతకై మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం చేపడుతున్న స్కాలర్‌షిప్ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 95 వేల మందికి లబ్ధి చేకూరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జోనల్ హెడ్ షణీబ్, కూకట్‌పల్లి స్టోర్ మేనేజర్ మహ్మద్ ఇర్ఫాన్, కేపీహెచ్‌బీ స్టోర్ మేనేజర్ శ్రీనివాస్. కెఎస్, మార్కెటింగ్ హెడ్ రాకేష్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఆర్. జోత్స్నరాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగేంద్రరావు, కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటయ్య, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స చేయించుకున్న కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీనాథ్‌కు రూ.2 లక్షలు, చింతల్‌కు చెందిన రామారావుకు రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఘనంగా సెయింట్ ఆంథోనీస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: సెయింట్ ఆంథోనీస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలను బుధవారం రాత్రి కొంపల్లిలోని జీబీఆర్ కల్చరల్ క్లబ్‌లో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ సుందర రాజు, అకాడమిక్ డైరెక్టర్ సరిత, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, మెట్రో టీవీ ఎండీ జయప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

కుత్బుల్లాపూర్: డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ బైకిస్టుకు తీవ్రగాయాలై మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జోగిపేట్‌కు చెందిన చెందిన గంజి ఎల్లాదాస్(41) కుటుంబం పదిహేను సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి కండ్లకోయలో నివాసముంటుంది. గురువారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఎల్లాదాస్ తన హోండా బైక్ పై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం (టీఎస్ 09 యు 6667) బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లాదాస్‌ను సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎల్లా దాస్(ఫైల్)

గెస్ట్‌హౌస్ కూల్చివేత

దుండిగల్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. దుండిగల్ గ్రామం సర్వే నంబర్ 454లో ఓ వ్యక్తి గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. బీజేపీ నిజాంపేట్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే గెస్ట్ హౌస్ యజమాని బెదిరింపులకు పాల్పడంతో సతీష్ అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో గురువారం రెవెన్యూ సిబ్బంది జేసీబీతో సదరు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు.



దుండిగల్ సర్వే నంబర్ 454లో గెస్ట్ హౌస్‌ను కూల్చివేసిన అధికారులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ఉపాధ్యక్షుడిగా సంపత్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కర్కాల ఉపేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడిగా కావలి గోపాల్, మేడ్చల్ నియోజకవర్గ లేబర్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేష్ నియమితులయ్యారు. కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, విద్యాశాఖ బోర్డు సభ్యురాలు కందాడి జోత్స్నరెడ్డిలను కలిశారు. కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ రాంభాగ్ ప్రకాశ్‌గౌడ్, మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ కందాడి సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: 33/11కేవీ మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీ నగర్ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ రోడ్డు, మయూరి నగర్, రత్నదీప్ వెనుక భాగం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఫీడర్లలైన్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దుర్గా ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దుర్గా ఎస్టేట్స్, వెన్నెలగడ్డ, బౌద్ధ నగర్, వసుధ అపార్ట్‌మెంట్స్, రాఘవేంద్రకాలనీ, పద్మనగర్ ఫేజ్ 2 లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

జేఎన్‌టీయూహెచ్‌లో సేవాలాల్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ కిషన్‌కుమార్ రెడ్డి, కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ జీవన్‌లాల్

కేపీహెచ్‌బీకాలనీ: సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జేఎన్‌టీయూహెచ్ యూజీసీ ఆడిటోరియంలో 'భోగ్‌బండారో, మెరామ యాడి' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వీసీ కిషన్‌కుమార్ రెడ్డి, కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ లవుడియా జీవన్‌లాల్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావులు హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత, గోర్‌బోలి గురించి, లక్కిష బంజారా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ మాధవి కుమారి, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, సీనియర్ ప్రొఫెసర్ నిమ్మ నాయక్, ఆంజనేయ ప్రసాద్, బాలు నాయక్, రూప్ సింగ్, రాంజీ నాయక్, సైదా నాయక్, బంజారా విద్యార్థి సంఘం రాష్ట్ర చైర్మన్ ధారావత్ నరేందర్ నాయక్, వ్యవస్థాపకులు భూక్యా రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు లకావత్ భానుప్రకాష్ నాయక్, జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ అకాష్ నాయక్, శశికుమార్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన 'ద్రవ్యక-2025' జాతీయ సదస్సు

కీసర: చీర్యాలలోని గీతాంజలి ఫార్మసీ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన 'ద్రవ్యక-2025' అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఫార్మసీ ఆవిష్కరణ పరిశోధనలో ఇటీవల సాధించిన పురోగతులపై అవగహన కల్పించారు. ఫార్మసిస్టు, రీసెర్చ్ స్కాలర్లు, శాస్త్రవేత్తలు, వివిధ కళాశాలల విద్యార్థుల్లో ఔషధ జ్ఞానాన్ని పెంపొందిచడమే ఈ సదస్సు ఉద్దేశమని కళాశాల చైర్మన్ జి.ఆర్.రవీందర్‌రెడ్డి అన్నారు. ముఖ్యఅతిథిగా ఐఓఈ రీసెర్చ్ చైర్మన్ ప్రొఫెసర్ డా. డి. బసవయ్య హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనపై మరింత దృష్టి పెట్టాలన్నారు. సదస్సులో దేశ నలుమూలల కళాశాలలు, పరిశ్రమల నుంచి 374 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 83 మౌఖిక ప్రదర్శనలు, 66 గోడ పత్రికలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డా. ఎం.రవికుమార్ ప్రొఫెసర్లు డా. ఐసాక్‌అనుకూరి, అధరవనాచారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు పూర్తి చేయరూ.. గుంతను పూడ్చరూ!



మరమ్మతుల కోసం తీసిన గుంత



వాహనదారులకు ఇబ్బందిగా మారిన రోడ్డు

నిజాంపేట్ : నిజాంపేట్ మల్లన్న గుడి సమీపంలో మంజీరా నీటి పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతులు ప్రారంభించారు. మరమ్మతుల కోసం గుంతను తవ్వి దాదాపు 20 రోజులుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రోడ్డు పక్కనే పైపులైన్ ముందు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిజాంపేట్ నుంచి జర్నలిస్ట్ కాలనీ మీదుగా గండి మైసమ్మ వెళ్లే రోడ్డు కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉటుంది. అదేవిధంగా ఈ మరమ్మతుల కోసం తీసిన గుంతలో చిన్నపిల్లలు పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి మంజీరా పైపులైన్ మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరించి.. గదులు నిర్మించి

- ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- నాయకులు, అధికారులు ఏకమై రూ.లక్షల్లో గదుల అమ్మకాలు!

చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్ సర్వే నంబర్ 155 లో 29 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ పక్కనే మరో రెండు ఎకరాల 39 గుంటల స్థలాన్ని ధోబీఘాట్ వాసులకు కేటాయించారు. 2007 లో సర్వే చేయగా 3550 గజాలు ఉన్నట్లు తేలింది. అదేవిధంగా 2019 లో మరల సర్వే చేయగా 353 గజాల స్థలం ఉందని, 2024 ఫిబ్రవరిలో జిల్లా అధికారులు సర్వే చేయగా 3553 గజాల స్థలం ఉందని డిజిటల్ సర్వే ద్వారా తేల్చారు. అనంతరం 2024 మే నెలలో గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులు 3553 గజాల ప్రభుత్వ స్థలం ఉన్నట్టు ఆర్టీఐ ద్వారా సమాచారం ఇచ్చారు. కానీ భగత్ సింగ్‌నగర్‌కు చెందిన కొంతమంది అధికార పక్షానికి చెందిన నేతలు, అధికారులు కుమ్మక్కై ఆర్టీఐ ద్వారా ఇచ్చిన నివేదికను పక్కకు పెట్టి సుమారు 11 గుంటల స్థలాన్ని ధోబీఘాట్ వాసులకు దక్కేలా మధ్యలో ప్రహరీ నిర్మాణం కోసం బేస్ మెంట్ నిర్మించారు. 2007 నుంచి పలుమార్లు సర్వే చేసి 90 శాతం మేర ఫెన్సింగ్ పూర్తి చేసి కేవలం 10 శాతం మేర మాత్రమే ఫెన్సింగ్ ఉంది.



కోర్టు పరిధిలో ఉండగా ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ గదులు



స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ (ఫైల్)

11 గుంటల స్థలాన్ని కబ్జాదారులకు అధికారులు ముట్ట చెప్పే ప్రయత్నం కనిపిస్తోందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10 పర్యాయాలు ఫెన్సింగ్స్ కాంపౌండ్ వాల్‌కు నిధులు మంజూరు చేసిన వారు 3500 గజాలకే ఎస్టిమేషన్లు వేయగా.. ఇప్పటి డీసీ 11 గుంటల స్థలాన్ని తగ్గించి ఫెన్సింగ్స్ బేస్మెంట్ నిర్మించడం విశేషం.

హైడ్రా ఆదేశాలు బేఖాతర్

ఈ 29 గుంటల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్న విషయమై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన సిబ్బందితో వచ్చి 16 జూలై 2024లో ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రభుత్వ స్థల విషయంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయినా నేడు దర్జాగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులంతా ఏకమై అధికారులను మచ్చిక చేసుకొని 11 గుంటల స్థలాన్ని కబ్జా చేసి చిన్న చిన్న గదులు నిర్మించి రూ.40 లక్షల చొప్పున ఒక్కొక్క గదిని అమ్మేసి దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దాటవేసే ధోరణిలో డిప్యూటీ కమిషనర్!

సర్వే నంబర్ 155 లో అక్రమ నిర్మాణాలపై గాజుల రామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డిని సాక్షి వివరణ కోరగా.. ముందుగా సర్వే నంబర్ 155 ఎక్కడ ఉందని, కొత్తగా అడుగుతున్నారని, నాకైతే సర్వే నంబర్ 147, 148 మాత్రమే తెలుసు అని దాటవేసే ప్రయత్నం చేశారు. 29 గుంటల ప్రభుత్వ స్థలం వివరాలు తెలిపిన తర్వాత జిల్లా సర్వే అధికారులు రిపోర్ట్ ఇచ్చిన ప్రకారమే బేస్మెంట్ నిర్మించామని, గతంలో చేసిన సర్వేకు 90 శాతం పూర్తయిన ఫెన్సింగ్‌కు మాకు సంబంధం లేదని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై పరిశీలించి నోటీసులు జారీ చేస్తామని, ఇప్పటికే చేపట్టిన కొన్నింటికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

నాడు కూల్చారు.. మరి నేడు?

ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులపై భగత్ సింగ్‌నగర్‌కు చెందిన మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అలా బకాష్ హైకోర్టును ఆశ్రయించారు. 3553 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసి ధోబీఘాట్ వాసులకు హద్దులు ఏర్పాటు చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఇక్కడ ఉన్న అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై హైకోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి నిర్మాణాలు చేస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారు. 2024 జూన్‌లో హైకోర్టు నుంచి ఉత్తర్వులు రాగా.. నేడు కోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే స్థలంలో 2016లో అక్రమ బేస్మెంట్లు నిర్మిస్తే అప్పటి డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కేసులు నమోదు చేసి చార్జిషీట్ సైతం ఫైల్ చేశారు. ఈ కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉండగా ఇప్పుడు మరల 2024 జూన్ నెలలో 29 గుంటల స్థలాన్ని కాపాడాలని ఉత్తర్వులు ఇచ్చింది.